# ఆ మేడ
# ఆ మనుషులు

అదే మా మేడ! ఆ మేడ దరిదాపుల్లోకి సామాన్యు డెవ్వడూ రాలేడు. హేమాహేమీలకార్లు అల్లంతదూరాన చప్పుడు చేయకుండా నిశ్శబ్దంగా నిలిచిపోతాయి. ఇహ బిక్షుకుల మాట చెప్పనే అక్కరలేదు. నా అంతట నేను, ఆ వీధిలోకి వచ్చేవరకు—నాకీ లోకంలో బిక్షుకు లనే వాళ్ళొక ళ్ళుంటారని తెలియదు. మామేడ దరిదాపుల్లో అటువంటి వారి జాడ లేదు.

ఆ పెద్దగేటు తెరచుకొని లోపలికి అడుగు పెడితే చాలు ఏదో స్వర్గలోకంలోనికి వెళ్ళిపోతూన్నట్లుంటుంది. ఆ అందమైన క్రోటన్సు అవి కత్తిరించబడిన తీరు తెన్నులూ చూడండి...కావ్యభాషలోని సౌందర్యం ఆ కత్తిరింపుల చమత్కారాల రామణీయకత ముందు మోకరిల్లుతుంది!

గోడలపై కనిపించీ కనిపించని వెన్నెలల మించిన లైటింగు, ఆ గదుల మొజాయిక్ ఫ్లోరింగు, ఇంద్ర సభలా చిత్రవిచిత్రమైన అలంకరణల సీలింగు—కళ్ళను జిగేల్ మనిపిస్తాయి, మొఘల్ సామ్రాజ్యాన్ని గుర్తుకు తెస్తాయి!

స్టైన్ లెస్ స్టీలు సోఫాలు, వాటిముందు దళసరి అద్దాల సెంటర్ పీసులు, వాటిమీద అందమైన గాజు కూజాలలోని రోజాలు...అప్సరసను నాట్యభంగిమలో అలా అలా నిలిపి నట్లుంటుంది!

ఒక్కొక్క గదికి ఒకే ఒక్క పెద్ద తైలవర్ణ చిత్ర ముంది. వాటిలో కొన్నివిదేశాలనుండి తెప్పించినవి. కొన్ని దేశీయులు చిత్రించినవి. అన్నీ అన్నీ ఎంతో ఖరీదైనవి. అన్నీ అన్నీ తమలోని మహాద్భుతసౌందర్యాన్ని పెనవేసుకో ప్రయత్నించే ఆకసాన్ని పరిహసించేవి!

అన్ని తలుపులకు, కిటికీలకు ఉన్న ఆ నాజూకైన తెరలు...ప్రపంచ ప్రజానీకానికి సిగ్గును నేర్పే విరిచేడియలు! అవి చిరుగాలి కదలికలలో సిగ్గు నభినయిస్తాయి. పెనుతుఫాను భీభత్సంలో హృదయాలను కంపింపజేస్తాయి.

ఏ గదిలో చూసినా అందమైన వాష్ బేసిన్ లు కని పిస్తాయి. లోలోపలి గదుల్లో భూమికి అడుగెత్తున డన్ లప్ పిల్లోఫోమ్ రబ్బరు మేట్రస్ లతో కూడిన మంచాలు! అపు రూప మైన ఒకటోరకం డిజైన్లు!

లోపల పెద్ద డైనింగ్ హాలు! అంటే భోజనాల గది. (ఇలా తర్జుమా చేసినందుకు క్షమించండి) ఎవ్వరు ఎప్పుడు వచ్చినా అతి రుచికరమైన వంటలతో వెచ్చవెచ్చని భోజనం సిద్ధంగా ఉంటుంది. రిఫ్రిజిరేటర్లలో ఉన్న పదార్థాలు

అందులో జాగ్రత్తగా తమ యౌవ్వనాన్ని భద్రపరచుకుంటాయి! మానవులు కూడా ఇలాగే తమ యౌవ్వనాన్ని కాపాడుకునే స్థాయి అచిరకాలంలో తప్పక వస్తుంది!

అవును. అలాగే జరుగుతుంది. అలాగే జరగాలి కూడా. ఇందుకు మేము ఎంతో సిద్ధముగా ఉన్నాం! మాలోని చల్లని ఎదతాలూకు చల్లదనమంతా ఏర్ కూలర్స్‌లో ఉంచి ఆ గదులు నింపాం. మా మెత్తని మనసుల మెత్తదనమంతా ఆ పరుపుల్లో వేసి కుట్టివేశాం. మాలో ఏ బాధల్ని చూసినా చలించే గుండెల్ని ఆ కిటికీ తెరలలో నింపి వ్రేలాడగట్టాం. ఇహ మేం పదార్థాలుగా మిగిలాం. అవును. ఇహ మేం రిఫ్రిజిరేటర్లలో భద్రంగా ఉండగలం!

అదిగో...

వారే మా తండ్రి!

చేయెత్తు మనిషి!

నిత్య ఖద్దరుధారి!

వయసు సుమారు అరవై ఏళ్లు. కాని వారిని శ్రోత్తగా చూసినవారు వారికి నలభై ఏళ్ళయినా ఉండవని తలపోస్తారు.

వారి శరీరం అటువంటిది.

అమృతం తాగినవారు దేవతలు మినహా మరెవ్వరూ ఉండి ఉండక పోవొచ్చు.

కాని... మా నాన్నగారు అమృతాన్ని మించిన దివ్యౌషధాన్ని సేవించారు !

మా నాన్నగారెప్పుడూ ఏ కష్టాన్నీ పొందలేదు. కష్టం వారి కాళ్ళకింద చెప్పులుగా మారిపోయింది! వారికేవిధమైన అసంతృప్తి లేదు. తృప్తి వారి వీపు వెనుక చేతులు జోడించుకొని నిస్వార్థ సేవకునిలా చలిస్తోంది, వారి ఆశలు, ఆశయాలు అన్నీ నెరవేరాయి. ఆ ఆశలు టెలిఫోను ఎక్స్‌ప్రెస్ కాల్స్ వంటివి! కోరిన చోటికి ఇట్టే దారితీయడంలో అఖండమైనవి. ఆ ఆశయాలు గ్రాండ్ ట్రంక్ రోడ్డుకు చెందిన సిమ్మెంటు గుండెలు! ఎప్పటికీ చలించనవి. అందరినీ ఏదారికైనా నడిపించగలిగేవి !

మా నాన్నగారి తలపై తలలేదు. తల లేక పోవడమే వారి గొప్పతనానికి చిహ్నం ! ఎర్రగా నున్నగా ఆ బట్టతల మెరుగు పెట్టిన రాగిరేకులా మెరిసిపోతూ వుంటుంది. ఇహ ఆ మీసాలు ఎప్పుడూ తెల్లబడవు. వాటిలోని, తెల్లదనాన్ని ఆతలపైన ఉన్న తెల్లని టోపీ తీసుకుంది. ఆటోపీలోని మాలిన్యాన్ని ఆ మీసాలు రుద్దుకున్నాయి !

తండ్రిని గురించి ఇట్లా వ్రాసే కుమారుడీ లోకంలో లేకపోవొచ్చు. కాని తండ్రులు కావలసిన వాళ్ళంతా .ఇది తెలుసుకోవలసిన అవసరం ఉంది!

అవును! వారు నాతండ్రి! ఇలా చెప్పడానికి నాకు బాధలేదు. వారు ఎన్ని దుష్కార్యాలు చేశారో అంతకు

రెట్టింపు సత్కార్యాలు చేశారు. నా కళ్ళముందు ఎన్నో ఎన్నో జరిగి పోయాయి. కాని నేను వాటిని గుర్తించే స్థితిలో లేను. ఇంచుక నేను గుర్తించే శక్తిని సాధించిన నాటికి ఈ విషాద గాథ నాముందు నిలిచింది. నాగుండెలు మా తండ్రి కోసం తపించి పోతున్నాయ్. కాని వారు నేడు లేరు. నేను ఏమిచేసి వారిని చేయగలను? ఈబాధతో నేను బ్రతుకలేను. నేను ఉండీ వారినీ దుస్థితి నుండి తప్పించలేక పోయాను. అవును. నేను చీకటినీ, వెలుతురునూ, ఆనాడు చూసే స్థితిలో లేను. నాకన్నీ మబ్బుకళ్ళతో చూస్తున్నట్లే ఉంది. కాని ఆనాటి వ్యవహారం అంతా నాకళ్ళకిప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఇందులో ఎవరెవరు భాగస్వాములో పూర్తిగా విశది మాతోంది. ఇప్పుడివన్నీ అనుకొని ఏమిలాభం? అంతా కుటుంబవ్యవహారం! ఇది ఎంత తీయని మాట ! కుటుంబవ్యవహారం ఇతరులకు తెలియ గూడదన్న మాట ? అన్ని కుటుంబాలూ ఇలాగే ఉండి, ఆ కుటుంబాలన్నీ ఇలాగే కుళ్ళిపోతే ఇహ ప్రపంచానికి మార్గం ఏదీ ? కాదు. ఇది ఎంత కుటుంబ వ్యవహారమైనా, అందరికీ తెలియవలసిందే... మా విషయాలు నాకు తెలిసినట్లు మీకు తెలియవు. అలాగే మీ విషయాలు నాకు తెలియవు. మీ విషయాలు నాకు, నావిషయాలు మీకు తెలిసినప్పుడు లోపాలు దిద్దుకో డానికి వీలుంటుంది. కాని మా విషయాలు మాత్రం నాకు ఏమి తెలిశాయి? ఎవరిగుండెల్లో ఏమి ఉన్నదో నేను ఎప్పుడు తరచి

చూడగలిగాను? కాని, కొన్ని సంఘటనలు మాత్రం నాకళ్ళ ముందు జరిగిపోయాయి. అవే నేను చూడగలిగాను.

**మా** కుటుంబంలో ఆరుగురు వ్యక్తులం. **మా** అమ్మ, నాన్నగారు. మా వదినగారు మా అన్న. **మా** అక్క. నేను సరేసరి. ఆ ఇంటిలో అందరికన్నా చిన్నవాణ్ణి!

మా అన్న 'లా' ప్రాక్టీసు చేస్తున్నాడు. **మా** అక్క బి. ఏ. చదువుతోంది. నేను ఇంటరు వెలిగిస్తున్నాను.

ఇందరమున్నా మా ఇంటిలో ఎవరికి ఎవరో... ఒకరి కష్టసుఖాలలో ఒకరికి పాలులేదు. ఎవరి బాధలు వారివే. ఒకరి బాధల నొకరు చెప్పుకోవడమ నేదిలేదు. ఒకరితో ఒకరు ఎప్పుడూ ముఖాముఖి **మా**ట్లాడుకోలేదు. ఒకవేళ మాట్లాడినా అవన్నీ వట్టి పొడిమాటలు !

**మా** నాన్నగారు ఎప్పుడూ ఎవ్వరితోనూ మాట్లాడరు. ఎవరితో మాట్లాడదలచినా వారిని తమవద్దకు పిలిపించు కుంటారు. అప్పుడే వారితో ఇంచుకంతసేపు సంభాషణ! అంతే ఆ ఇంటర్‌వ్యూ అయిపోతుంది. అదంతా ఒక వ్యవహారం. అయిపోయిన వెంటనే ఎవరిగదులలో వారే!

మా అన్నగారు నాతో ఎప్పుడూ మాట్లాడరు. అవును. ఎవరికివారే గొప్పవారు. అనవసరంగా మాటలు వేస్టు చెయ్యరు. మాటలు వేస్టు అయితే మనిషి విలువ వేస్టు అవుతుంది. మా ఇంటిలో మూలిగే సత్యాలలో ఇదొకటి! పౌరుషం మా ఇంటిలో పులిగోళ్లు పెంచుకుంది. ఆభిజాత్యం

మా సౌధంలో మందుగుండు సామాను! ఇంటిలో అందరూ డబ్బున్నవాళ్లు. ఎవరి ఎకౌంటు వారిదే! మా అమ్మకు బోలెడంత ఆస్థి. అదిసముద్రపునీళ్ళలా ఎవ్వరూముట్టుకోడానికి వీలు లేకుండా మూలుగుతోంది. మా వదినగారు తనతో తెచ్చుకున్న ఆస్తులు, ఎకౌంటు పుస్తకాలలో రాణీవేషం వేసుకొని తళుక్కు మంటున్నాయ్. ఎటొచ్చీ మాఅన్నగారూ, నేనూ ఆస్తిలేనివాళ్లం. కాని మా అన్నగారికీ విషయంలో కొంత సౌలభ్యం ఉంది. భార్య ఆస్థి ఒకటి ఉన్నదన్న ధైర్యముంది. మా అక్కకు, మా అమ్మ ఆస్థి తనదేనన్న నమ్మకముంది. ఇక నేను మిగిలాను. మా నాన్నగారు నాకు ఏమి ఇవ్వగలరో తెలియదు వారి ఆస్థి ఏస్థితిలో ఉన్నదో మా అమ్మగారికి తప్ప ఇతరు లెవ్వరికీ తెలియదు. ఇవన్నీ తెలుసుకోవాలన్న కుతూహలం నాకప్పటిలో లేదు. ఇది ఇలా ఉండగా మానాన్నగారి ఖర్చుకు ఓ పరిమితి లేదన్నది బహిరంగ సత్యం !

ఆనాడు మా ఇల్లు ఏ మానవుడూ ఊహించడానికి వీలులేనంత భయంకరంగా ఉంది. ఇలాంటి దృశ్యాన్ని నేనెన్నడూ దర్శించలేదు. నా గుండె ఒక్కసారి అస్తవ్యస్తమై పోయింది.

నా మనసులో వ్యాకుల పాటు చిరుగుల కోటులా క్షణక్షణం అవమాన పరుస్తోంది. దుఃఖపెట్టుతోంది. దారిలో పెద్దగుమాస్త కనిపించి, మీ నాన్నగారి పరిస్థితి ఏమీ బాగు

లేదు. మీ అమ్మగారు కాని, మీ వదిన గారు కాని ఆదు కోక పోతే బజారులో పరువునిలబడటం చాలా కష్టం... అన్నాడు. నా గుండె ఒక్కసారి ఆగిపోయింది. నేను మెల్లగా మా సౌధంలో అడుగు పెట్టాను.

పచ్చగా మహోజ్వలంగా మెరిసిపోయే కనులకు ప్రాణం వంటి మా "లాన్" చిందర వందర చేయబడి నట్లు నా మనస్సు వ్రక్కలై పోతోంది. మానవుని ఉన్నత శిఖరా లకు తీసుకొని పోయే మా ఇంటిలోని వర్ణచిత్రాలు ఒక్కు మ్మడిగా శీర్ణమై నాముందు రాలి పోయినట్లు నా గుండె కూలి పోతోంది. ఎక్కడ చూసినా సౌందర్యం తప్ప ఇక ఏవిధమైన భావానికి సందునీయని మాభవనం తన సర్వ స్వమూ పోగొట్టుకొని భయంకరమైన కుష్టు వ్యాధితో నా మీదికి వస్తూన్నట్లు నా గుండె తల్లడిల్లి పోతోంది.

ఇదంతా నా మనసులోని విపరీత భావ పరిణామమే కావొచ్చు! దీనికర్థం నా కంతు బట్టక పోవొచ్చు కాని— నాలో ఆ క్షణాన జవ సత్వాలుడిగి పోయాయి. అవును అసలు దీని కంతటికీ హేతువేమిటి? ఎందుకు నాలో ఇల్లాంటి విపరీత పరిస్థితి? అయ్యో... నా నెత్తిమీద మిన్ను విరిగి పడుతోంది కాబోలు. ఈ కాలు క్రింద ధాత్రి ఊబికిరింద మారిపోతోంది కాబోలు! ఏమిటో ఆక్షణాన ఇందరికి అన్నో దకాలిస్తూన్న భువి, ఆకలితో సొమ్మసిలి పోతూన్న ట్లనిపిం చింది. ఇంత మందికి ప్రాణం పోస్తూన్న వాయుదేవునికి

ఆనాడు ఊపిరిపోసే నాథుడే లేనట్లుంది. ఇంతటిలోకానికి. కాంతినిచ్చే ఆభానుమూర్తి ఇంటిలో దీపం ఆరిపోయి నట్లుంది !

నాలో ఎవ్వరోనవ్వుతున్నారు. విహ్వాలంగా వికృతంగా నవ్వుతున్నారు. మేధస్సుకు భాష్యాలవంటి మానవులు తగల బడిపోతూండగా విశ్వ మానవుడు విలపించలేక పిచ్చి పిచ్చిగా నవ్వుతూన్నట్లు నవ్వుతున్నారు. కోటి కోటి నెత్తురు మరక ల్లోంచి తల ఎత్తి, కన్నుల నుండి రక్తపు చుక్కలు, బొట్లులు బొట్లులుగా జారుతూన్నట్లు ఎవ్వరో నవ్వుతున్నారు !

నేను మా సౌధంలో అడుగు పెట్టాను. ఎక్కడ ఉండ వలసినవి అక్కడే అలాగే ఉన్నాయి. కాని... కాని...మా అమ్మగారు ఆగదిలో కూర్చున్నారు... వారెప్పుడూ అలా ఆగదిలో కూర్చుండలేదు.

వారి మొగంలో రక్తనాళాలు ముక్కలు ముక్కలు క్రింద తెగిపోయి నట్లుంది. ఒక్క మాటలేదు. ఒక్కపలుకు లేదు. అచూపులో చూపులేదు. ఆపెదవి విడివడదు !

"అమ్మగారూ..." నాకంఠం మృదువుగా జాలిగా ప్రకంపించింది.

వారు చిన్నప్పుడు తన తల్లిని ఇల్లాగే పిలిచే వారో లేదో... కాని, ఏ తల్లి పిల్లలు—ఆధ్వనిలో గాఢ పరిష్వం గాన్ని వాంఛించరు ?

కాని, అమ్మగారిచెంతకు ఆ నామాటచేరలేదు. వారు అక్కడ నుండి రక్తపు బావుటావలె, నెత్తురు పాయవలె కదలి పోయారు.

నా నాలుక నానోటిలో తెగి రాలిపోయింది. నాచూపులు నాగుండెలో కూరుకొని పోయాయి. నాకంఠం, నా మస్తిష్కంలో అరచే శక్తిలేక నశించింది!

ఇంకొక్క అడుగు నేను ముందుకువేశాను. మా వదిన గారు కనిపించారు.

ఆమె తన దీర్ఘకేశములను ముడివేసి ఉన్నారు. వారి కన్నులలోని ఎర్రనిజీర ప్రాణాలను తోడు తోంది. కెంపులు వంటి వారి పెదవులు లీలగా చలిస్తున్నాయి. గుండెలను జలదరింప జేస్తున్నాయి. ఆమె అటుతిరిగి ఆగదిలోనికి వెళ్ళిపోయింది. సౌందర్యానికి మచ్చలా కదలి పోయింది.

అరే... ఇదేమిటి... ఈ వేళప్పుడు నాన్నగారి గది లోంచి అన్నగారు రావడమేమిటి?

ఘాటూన్గా నిలువెత్తు మనిషి! కోపాన్ని బిరుసుగా ఎగదువ్వుకున్న వ్యక్తి! కళ్ళల్లో భీభత్సాన్ని ముడివేసిన చూపు! నాసికలో కాఠిన్యాన్ని ఎగజిమ్ము శ్వాస! పెదవి బిగువులో ఎనలేని దౌష్ట్యాన్ని దాచగలశక్తి!

'నాన్నగారు నిన్ను పిలుస్తున్నారు' అంటూ ముందుకు సాగిపోయారు.

నా కాళ్ళల్లోశక్తి సన్నగిలి పోయింది. ఆగదిలో ఎలా అడుగు పెట్టానో తెలియదు !

నా గుండెల్లోంచి బాధ రాకెట్టులా పొగలు జిమ్ముతూ లేస్తోంది. అది ఏగమ్యస్థానానికి తీసుకొనిపోతుందో తెలియదు. ఒక్కసారి నాకళ్ళు నా తండ్రిగారి కోసం ఆ విశాలమైన గదినంతటినీ వెదకి చూశాయి. ఆ కనులకు ఏమీ కనిపించలేదు. చేయెత్తు మనిషి... నిండైన విగ్రహం... అయ్యో... ఎక్కడ... మా నాన్నగారెక్కడ?

మరొక్కసారి నాకనులు ఆ ఇల్లంతటినీ వెదికాయి.

"నాన్నా...నాన్నా" అంటూ నా గుండె ఒక్కసారి కెవ్వుమంది.

ఆ మూల...

ఆ చిన్న కుర్చీలో...

ఆ దుప్పటి ముసుగులో

కుమిలిపోతూ, కుళ్ళిపోతూ

గతాన్ని తలుచుకోలేక

భవిష్యత్తును ఊహించుకోలేక

మేధస్సును పగుల గొట్టుకొని—

విలపిస్తూన్న వృద్ధమూర్తి...

నాగుండె చలించి పోయింది. వారి ముందు ఎలానిలిచానో తెలియదు. కన్నీళ్ళతో, దిక్కుతోచని వానిలా కరిగి పోతున్నాను. అప్పుడే ఆ నా తండ్రి పెదవులమీద ఏదో కద

లిక. నిజంగా అది కదలిక కాదు. ఏదో చెప్పబోయి ఇక చెప్పడానికేముంది అన్నట్లు ఆ పెదవులు నిలచిపోయాయి. ఆ చూపులలో బిచ్చగాని కుత్తుక రెపరెపలాడింది. నాలోని సమస్తమూ ముక్కలు ముక్కలు క్రింద తెగి రాలిపోతోంది. అప్పుడే మా నాన్న, ఒకరికి ఇవ్వడమేగాని పుచ్చుగోవడ మెరుగని ఆ నాతండ్రి, 'బాబూ...అమ్మకు చెప్పవూ వాడికి తెలియకుండా చెప్పాలి...చెప్తావుకదూ' మెల్లగా జాలిగా అం టూనే ఉన్నాడు. నేను మా అమ్మ దగ్గరకు గబగబా, మహోద్రేకంతో, నెత్తురు జ్వాలలా, భయంకరంగా వెళ్లాను. కాని ఏమి లాభం? ఇంతలోనే నాన్నగారి గదిలోంచి భీభ త్సంగా అరుపు...నా తల వెళ్ళి ఆగోడను గ్రుద్దుకొంది. నా కన్నులు నా తండ్రి పాదాల మీద వ్రాలిపోయాయి. ఈ నెత్తురు కూడు నేను ముట్టను నాన్నా...నేను ముట్టను. అని ఈ కంఠం ఏమేమో శపథం చేస్తోంది. కాని...కాని...శాంతి లేని నా తండ్రి గుండెల్లో, విశ్వమంతా నిండి విలపిస్తూన్న నాజనకుని హృదయ కుహరంలో, శూన్యమే శయనించిన ఆ నేత్రద్వయంలో ఏఅమృతాన్ని నింపగలను.. ఏ వెన్నెల్ని పండించగలను... అయ్యో ఎంత నీరస పడిపోయింది ఈ బ్రతుకు? ఎందుకూ కొరగాదు. కన్న తండ్రికే ఇంత సాయం చేయ పనికి రాని బ్రతుకు!

— స్వతంత్ర 21–11–59